యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 8 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ అన్నారు. బుధవారం తారా ప్రభుత్వ కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో 'మత్తు పదార్థాల వినియోగం – దుష్పరిణామాలు' అనే అంశంపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రూపాల్లో మత్తు పదార్థాలను వినియోగించడం ద్వారా యువత తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం రిసోర్స్ పర్సన్ మురళి, ఎక్సైజ్ సీఐలు పి శ్రీనివాస్‌రెడ్డి, అనుదీప్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్, నిర్మల, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ మల్లిక, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుమతి దేవి, డాక్టర్ సదయ్య కుమార్, నెహ్రూ యువకేంద్రం సిబ్బంది అనిల్‌రెడ్డి, అజయ్, సాయిరాం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్య సమస్యలపై జాగ్రత్తగా ఉండాలి

ఇదిలా ఉండగా, బుధవారం తారా ప్రభుత్వ కళాశాలలో మన దవాఖాన ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు డాక్టర్ సబిత మాట్లాడుతూ మహిళలు అనేక రకాల సమస్యలతో ఇబ్బందులకు గురవుతారని వివరించారు. ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మన దవాఖాన వైద్యులు, కళాశాల వాణిజ్య విభాగాధిపతి జ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బొంతపల్లి యువకుడికి సావిత్రిబాయిపూలే అవార్డు

అవార్డు అందుకుంటున్న విష్ణువర్ధన్

గుమ్మడిదల, జనవరి 8 : మండలంలోని బొంతపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ బీఆర్.అంబేద్కర్ యువజన సంఘం నాయకుడు విష్ణువర్ధన్ గతంలో సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రకటించాలని విన్నవించారు. కాంగ్రెస్ సర్కారు సావిత్రిబాయిపూలే జయంతిని మహిళా ఉపాధ్యాయదినోత్సవంగా ప్రకటించడంతో తన కల సాకారమైనందుకు ఆయువకుడికి విజ్ఞాన్ దర్శన ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ రోజారాణి చేతుల మీదుగా సావిత్రిబాయి పూలే అవార్డు అందుకున్నట్లు బుధవారం తెలిపారు. మూఢ నమ్మకాల నిర్మూలనపై అవగాహన కలిగిస్తానని తెలిపారు. ఈ అవార్డు దక్కినందుకు సంతోషం వ్యక్తం చేశారు.

మున్సిపాలిటీ వద్దు..

గుమ్మడిదల గ్రామసభలో తీర్మానం

గుమ్మడిదల గ్రామసభలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి అఖిలేశ్‌రెడ్డి

గుమ్మడిదల, జనవరి 8 : మున్సిపాలిటీ వద్దంటూ గ్రామసభలో తీర్మానం చేశారు. మండల కేంద్రమైన గుమ్మడిదలలో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. ఇందులో మండల ప్రత్యేకాధికారి అఖిలేశ్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామసభలో స్థానిక రైతులు, మాజీ సర్పంచ్‌లు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులందరూ కలిసి మున్సిపాలిటీ ఏర్పాటు వద్దని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. రైతులు, పేదలు ఉన్న గ్రామాన్ని పంచాయతీగానే కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా రైతు బాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు, పేదలు, కూలీలు ఉన్న గ్రామాన్ని మున్సిపాలిటీ చేయడం సరికాదన్నారు. దీని వల్ల పేదలు నష్టపోతారని సూచించారు. వెంటనే మున్సిపాలిటీ నిర్ణయాన్ని వెనుక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వీరితో పాటు పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, తలుసి దాసు, నాయకులు పుట్టనర్సింగ్‌రావు, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూమిని పరిశీలించిన ఆర్డీవో

గుమ్మడిదలలో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో రవీందర్‌రెడ్డి

గుమ్మడిదల, జనవరి 8 : మండల కేంద్రమైన గుమ్మడిదలు గ్రామ శివారులో 109 సర్వేనెంబర్ ప్రభుత్వ భూమిని ఆర్డీవో రవీందర్ రెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీరితోపాటు తహసీల్దార్ గంగాభవా నీ ఆర్ఐ ప్రవీణ్ ఉన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 19 సర్వే నెంబర్‌లో సర్వేయర్‌తో భూమిని సర్వే చేయిస్తున్నామని తెలిపారు. జిల్లా అధికారుల సూచన మేరకు ఈ భూమిలో ఎంతమందికి రైతులు ఉన్నా రు. ఎంతమందికి గతంలో ప్రభుత్వం పట్టా లు ఇచ్చింది అనే అంశంపై ఆర్డీవో ఆరా తీశారు. ఈ భూమి సర్వేను వేగవంతం చేయాలని సర్వేర్‌కు సూచించారు.

యూజీడీ పనులపై కౌన్సిలర్ ఆరా

జిన్నారం/బొల్లారం జనవరి 8 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు లక్ష్మీ నగర్‌లో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను కౌన్సిలర్ సంతోషలక్ష్మిరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్, స్థానికులు పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ రుణాలు అందించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 8 : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రుణాలను అందించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సాంకేతిక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025–26 ఏడాదికి డెయిరీ, ఫిష్, పౌల్ట్రీ రుణాల జారీకి వివిధ డెయిరీ, గొర్రెలు, పౌల్ట్రీ యూనిట్‌లకు ఫైనాన్స్ రికవరీకి గడువు తేదీని సమావేశంలో నిర్ణయించారు. రైతులకు రుణాలను ఇవ్వడంతో పాటు డిపాజిట్లను సేకరించాలని కలెక్టర్ సూచించారు. సహకార బ్యాంకు ద్వారా రైతులకు గృహ నిర్మాణ రుణాలు వంటి వినూత్న పథకాలను అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో శ్రీనివాస్, ఎల్‌డీఎం గోపాల్‌రెడ్డి, బ్యాంకు అధికారులు, సం బంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయం తనిఖీ

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 8 : వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయాన్ని డీజీ అభిలాష బిస్త్ ఐపీఎస్ తనిఖీ చేశారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. సిబ్బందికి టర్న్ అవుట్, మాబ్రిల్ డ్రిల్, వెపన్‌డ్రిల్ తనిఖీ చేశారు. అనంతరం ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో రికార్డులను, ఆయుధగారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ సిబ్బందికి సంబంధించి ఎలాంటి బిల్స్ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఎస్పీ రూపేశ్, అదనపు ఎస్పీ సంజీవరావు, డీటీసీ అదనపు ఎస్పీ శ్రీనివాస రా వు, ఏవో కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

బస్సు బైకు ఢీ.. కేసు నమోదు

కల్హేర్, జనవరి 8: 161 జాతీయ నంబర్ రహదారి బాచేపల్లి గ్రామం సర్వీస్ రోడ్డులో ఆర్టీసీ బస్సు బైకు ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పిట్లం నుంచి హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో నిజాంపేట్ మండలం బాచేపల్లి వద్ద ప్రయాణికులను ఎక్కించుకునేందుకు జాతీయ రహదారి పక్క నుంచి వచ్చే సర్వీస్ రోడ్డుపై బస్సు వస్తుంది. ఈ క్రమంలో నిజాంపేట్ మండలం ర్యాలమడుగు గ్రామానికి చెందిన కమ్మరి పండరి బైక్ పై గ్రామం వద్ద ఉన్న బ్రిడ్జి కింద నుంచి పిట్లం వైపు వెళ్లేందుకు మలుపు తిరిగే సమయంలో ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో పండరికి తీవ్రగాయాలు కావడంతో సంగారెడ్డిలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు ప్రత్యక్ష సాక్షుల ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమో దు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యూటర్న్‌ల వద్ద పొదల తొలిగింపు..

మూలమలుపులు.. ప్రమాదానికి పిలుపులు కథనానికి స్పందన

గుమ్మడిదల, జనవరి 8 : మూలమలుపులు.. ప్రమాదానికి పిలుపులు కథనానికి పోలీస్‌శాఖ,అటవీశాఖ అధికారులు స్పందించారు. బాలానగర్–మెదక్ జాతీయ రహదారిపై పదుల సంఖ్యలో మూలమలుపులు ఉండడంతో ప్రమాదాలకు పిలుపుగా మారిందని పోలీస్ అధికారులు అటవీశాఖ అధికారులతో కలిసి పొదలను తొలగిస్తున్నారు. బుధవారం మండలంలోని మంభాపూర్, నల్లవల్లి అటవీ ప్రాంతంలోని జాతీయ రహదారి (765డీ) మీదుగా వెళ్తున్న రహదారికి ఇరువైపులా మూలమలుపులు ఉన్నాయి. దీని వల్ల నర్సాపూర్ – గుమ్మడిదల మధ్యలో ఉన్న మూలమలుపులకు అడ్డుగా ఉన్న పొదలను సీఐ నయిమొద్దీన్, ఎస్సై మహేశ్వర్‌రెడ్డి, అటవీశాఖ బీట్ రూట్ సిబ్బందితో కలిసి పొదలను తొలిగించే పనుల్లో నిమగ్నమయ్యారు. సూచిక బోర్డులు వాహనదారులకు కనిపించే విధంగా యూటర్న్‌ల వద్ద ఉన్న పొదలను తొలిగిస్తున్నారు. సూచిక బోర్డులు లేని వద్ద బోర్డులు ఏర్పాటు చేయిస్తున్నారు. 6 రోజుల కింద నల్లవల్లి అటవీప్రాంతంలోని మేడాలమ్మ ఆలయ సమీపంలో భారీ రోడ్డు ప్రమాదం జరిగి అందులో నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై 'నమస్తే తెలంగాణ'లో మూలమలుపులు ప్రమాదానికి పిలుపు అన్న కథనంపై సీఐ నయిముద్దీన్, ఎస్సై మహేశ్వర్‌రెడ్డి,అటవీశాఖ సెక్షన్ అధికారి హుస్సేన్ స్పందించారు. జేసీబీలతో యూటర్న్‌లకు అడ్డుగా ఉన్న పొదలను తొలిగిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. గుమ్మడిదల పరిధిలో ఉన్న మూలమలుపుల వద్ద ఉన్న పొదలను తొలిగిస్తున్నామని తెలిపారు. నర్సాపూర్‌కు చెందిన అటవీశాఖ, అధికారులు స్పందించి ఆ పరిధిలో ఉన్న యూటర్న్‌ల వద్ద ఉన్న పొదలను పిచ్చి మొక్కలను తొలిగించి సూచిక బోర్డులు కనిపించే విధంగా ఏర్పాట్లు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. వాహనదారులు ఈ రోడ్డుపై నెమ్మదిగా ప్రయాణించాలని సూచించారు.

నల్లవల్లి అటవీప్రాంతంలో యూటర్న్‌ల వద్ద ఉన్న పొదలను తొలిగిస్తున్న అధికారులు

జొన్న పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కృష్ణాపూర్ గ్రామ శివారులో జొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నూతన్ కుమార్

కల్హేర్, జనవరి 8 : యాసంగిలో రైతులు సాగు చేసిన జొన్న పంటకు మొగి పురుగు, కత్తెర పురుగుతో పాటూ పేను ఆశించడం జరిగిందని వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని ఏడీఏ నూతన్‌కుమార్ రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని కృష్ణాపూర్ గ్రామ శివారులో రైతులు సాగు చేసిన జొన్న పంటను పరిశీలించారు. ఏదైనా అనుమానాలు ఉంటే ఏఈవోలను సంప్రదించాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కృష్ణవేణి, మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

భెల్ డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీలు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

రామచంద్రాపురం, జనవరి 8 : బీహెచ్ఈఎల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు సంక్రాంతి ముగ్గుల పోటీలను బుధవారం నిర్వహించారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని కళాశాల ఆవరణంలో రంగుల ముగ్గులు వేశారు. విజేతలకు బహుమతుల ప్రదానం చేయడంతో పాటు ఐదుగురికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కవిత, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి, కొమిరిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షుడు సాయిబాబా, అధ్యాపకులు డాక్టర్ అనురాధ, ప్రజ్వల, జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ బుక్కులు పంపిణీ

నాగల్‌గిద్ద, జనవరి 8 : నూతనంగా నియమితులైన 36 మంది ఉపాధ్యాయులకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మాణయ్య, మండలాధ్యక్షుడు షేరికార్ రమేశ్ ఆధ్వర్యంలో బుధవారం సర్వీస్ బుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమస్య పరిష్కరానికి పీఆర్టీయూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మన్మధ కిశోర్, కాంప్లెక్స్ హెచ్ఎం. శంకర్ తదతరులు ఉన్నారు.

గొటిగార్‌పల్లిలో పేకాట రాయుళ్ల అరెస్టు

కోహీర్, జనవరి 8 : మండలంలోని గొటిగార్‌పల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న పేకాట రాయుళ్లను అరెస్టు చేశామని ఎస్సై గోపతి సతీశ్ వెల్లడించారు. బుధవారం సమాచారంతో గ్రామంలో తనిఖీలు నిర్వహించి పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేశామ ని చెప్పారు. నిందితుల నుంచి రూ. 6.500 నగదు, 5 మొబైల్ ఫోన్లు, 7 బైకులను స్వా ధీనం చేసుకున్నామన్నారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ మట్టి రవాణా

టిప్పర్లతో మట్టిని తరలిస్తున్న దృశ్యం

గుమ్మడిదల, జనవరి 8 : మండలంలోని నల్లవల్లి గ్రామ శివారులో 272 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమి నుంచి కొందరు అక్రమ మట్టి వ్యాపారస్తులు దర్జాగా పట్టపగలే బుధవారం టిప్పర్లతో రవాణ చేస్తున్నారు. ఈ విషయంపై స్థానికులు తహసీల్దార్ గంగాభవానీకి ఫిర్యాదు చేయగా, అక్రమ మట్టి వ్యాపారస్తులపై చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. టిప్పర్ల సాయంతో మట్టిని తరలిస్తున్న వాహనాలను సీజ్ చేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా, అక్రమ మట్టి వ్యాపారం తరలింపు తమ దృష్టికి వచ్చిందని వెంటనే సంబంధిత కారకులపై చర్యలు తీసుకొని తరలిస్తున్న మట్టి టిప్పర్లను సీజ్ చేస్తామని ఆమె తెలిపారు.

యువజనుల శ్రమదానం

రోడ్డు పక్కన చెత్తాచెదారాన్ని తొలిగిస్తున్న యువజనులు

గుమ్మడిదల, జనవరి 8 : గుమ్మడిదల మండల కేంద్రంలో జాతీయ రహదారి 765డి రోడ్డు పక్కన చెత్తా చెదారాన్ని మండల యువజన సంఘాల సమితి ఆధ్వర్యంలో బుధవారం తొలిగించారు. ఈ శ్రమదానం కార్యక్రమంలో గుమ్మడిదల గ్రామ పంచాయతీ కార్యనిర్వహణ అధికారి ప్రభాకర్, జిల్లా యువజన సంఘాల సమితి ప్రతినిధులు మంద భాస్కర్ రెడ్డి, వీఎం. ఎల్లయ్య పాల్గొని శ్రమదానం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలన్నారు. కార్యక్రమంలో మల్లెపల్లి ప్రకాష్ విష్ణువర్ధన్, ముద్దంగుల ప్రసాద్, బత్తెపు ఈశ్వర్, భయన్నోల్ల దాసు, ఉప్పరి శేఖర్, కోలుకూరి పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు, నోట్‌బుక్స్ పంపిణీ

జగదేవపూర్ జనవరి 8 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు సేవ చేయడం అభినందనీయమని మండల విద్యాధికారి మాధవరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తీగుల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మారేడుపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సుంకీ, కాంప్లెక్స్ హెచ్ఎంలు సైదులు, కనకయ్య, గోపికళ, ఉపాధ్యాయులు ఉన్నారు.

పార్ట్ టైం ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

హత్నూర, జనవరి 8 : మండల కేంద్రమైన హత్నూర డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సులో బోధించుటకు అధ్యాపకుడి కోసం దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్ తెలిపారు. కళాశాలలో ఫార్మాటెక్ కోర్సు బోధించుటకు ఎం ఫార్మసీ పూర్తి చేసిన అభ్యర్థితోపాటు లైబ్రేరియన్ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు అర్హత ధృవపత్రాలతో గురువారం కళాశాలలో నిర్వహించే డెమోకు హాజరుకావాలని కోరారు.

తీగుల్ పాఠశాలలో ఫుడ్ పెస్టివల్

జగదేవపూర్ జనవరి 8 : పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని మండల విద్యాధికారి మాధవరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తీగుల్ ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి విద్యార్థులు తీరొక్క రుచులతో కూడిన వంటకాలను చేసుకొచ్చారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించిన ఆయన మాట్లాడారు. ఫుడ్ పెస్టివల్ ద్వారా పిల్లలకు రకరకాల వంటకాలు పోషకాహారం పట్ల అవగాహన కలుగుతుందన్నారు. కాంప్లెక్స్ హెచ్ఎంలు సైదులు, కనకయ్య, గోపికళ, ఉపాధ్యాయులు సత్తయ్య, అమీతమ్మ, నాగరాజు, భాస్కర్, సంతోషి, పోచం, నాయకులు భుమయ్య, మహేందర్‌రెడ్డి, దయానందరెడ్డి అమ్మ దర్శ కమిటీ కన్వీనర్ సుజాత, తదితరులు ఉన్నారు.

తెలంగాణలో నాణ్యమైన విద్యను అందజేద్దాం

బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

సమావేశానికి హాజరైన మంత్రి ప్రభాకర్, స్కూల్స్ యజమాన్యాలు

పటాన్‌చెరు, జనవరి 8 : తెలంగాణలో నాణ్యమైన విద్యను అందజేద్దామని మంత్రి పొన్నం పరభాకర్ అన్నారు. బుధవారం పటాన్‌చెరు పట్టణ శివారులోని పాటి చౌరస్తా ఎస్‌వీఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన టీఆర్ఎస్ఎంఏ స్టేట్ జనరల్ బాడీ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా హాజరైన పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 60శాతం విద్యార్థులు ప్రైవేటులో చదువుతున్నారన్నారు. టీఆర్ఎస్ఎంఏ సంఘం పనితీరు విద్యావ్యవస్థను బలోపేతం చేసేలా ఉందన్నారు. మీ డిమాండ్లు, సలహాలను ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్యను అందజేసే గురుతర బాధ్యతను స్వీకరించి నవసమాజ నిర్మాణంలో పాల్పంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. మధుసూదన్, రాష్ట్ర కార్యదర్శి ఎన్. రమేశ్‌రావు, రాష్ట్ర ట్రెజరర్ రాఘవేందర్‌రెడ్డి, విలియం జెమ్స్, ప్రభాకర్‌రెడ్డి, సాయితేజ, ఉమా మహేశ్వర్‌రావు, ముహ్మద్ ఇస్తియాఖ్ గుల్షన్, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, కోమటి రెడ్డి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా కూల్చివేతలు

అసైన్డ్ భూముల్లో నిర్మించిన ఇండ్లను జేసీబీతో కూల్చి వేస్తున్న సిబ్బంది

జిన్నారం/బొల్లారం జనవరి 8 : ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటున్నట్లు గడ్డపోతారం గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. సర్వే నెంబర్ 10లోని దాదాపు రెండు ఎకరాల ప్రభుత్వ భూముల్లో నిబంధనలను ఉల్లంఘిస్తూ కొందరు ఇండ్ల నిర్మాణాలు చేపట్టారని జిల్లా ఉన్నతాధికారులకు ఇప్పటికే ఫిర్యాదు చేశారు. గ్రామస్తుల ఫిర్యాదులతో తహసీల్దార్ భిక్షపతి ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ రంగంలోకి దిగి అక్రమంగా నిర్మించిన ఇండ్లను కూల్చివేతలు చేశారు. కాగా 8 ఇండ్లకు బదులు మూడింటిని నేలమట్టం చేశారు. మిగిలిన 5 ఇండ్లను అలాగే వదిలివేయడంతో అధికారుల తీరుపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తూతూమంత్రంగా కూల్చివేతల చర్యలు చేపట్టడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డి మాండ్ చేస్తున్నారు. కార్యక్రమంలో రెవె న్యూ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

భూములు పేదలకు చెందినవే..

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి

గుమ్మడిదలలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి

గుమ్మడిదల, జనవరి 8 : మండల కేంద్రంలోని 109 సర్వే నంబర్ ప్రభుత్వ భూములను గతంలో భూమిలేని పేదలకు కేటాయించారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన బీఆర్ఎస్ శ్రేణులు, స్థానికులతో మాట్లాడారు. గతంలో నర్సాపూర్ నియోజకవర్గంలో ఉన్న గుమ్మడిదలను అప్పటి ఎమ్మెల్యే చిలుముల విఠల్‌రెడ్డి భూమి లేని పేదలకు పట్టాలు అందజేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్‌లో 109 సర్వేలో ఉన్న 189 ఎకరాల భూములో రెవెన్యూ అధికారులు కొత్తగా సర్వే చేయడమేంటని ప్రశ్నించారు. విశ్వాసనీయ సమాచారం మేరకు ఆ భూముల్లో ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ సర్కారు కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ఇలా అయితే గుమ్మడిదల గ్రామంలో రైతాంగం ఏకతాటిపైకి వచ్చి పంజాబ్ తరహాలో రైతుల ఉద్యమం చేస్తామని సర్కారుకు హెచ్చరించారు. పేదలకు ఇచ్చిన భూములు గుంజుకోవడానికి ప్రయత్నిస్తే సహించేది లేదన్నారు. గతంలో పేదలకు ఇచ్చిన భూములను పేదలకే చెందాలన్నారు. ఈ సర్వే నంబర్ భూముల్లో మిగులు భూముల్లో పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో పేదల కోసం ఇండ్ల స్థలాల కోసం ఈభూమిని కేటాయించారని గుర్తు చేశారు. ఈ భూ ముల జోలికి వస్తే సర్కారుకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. నాయకులు మంద భాస్కర్‌రెడ్డి, కాలకంటి రవీందర్‌రెడ్డి, వాసుదేవారెడ్డి,సత్యనారాయణ, ఆం జ నేయులు యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, మల్లేశ్, వెంకట్‌రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

చైనా మాంజాను వినియోగిస్తే కఠిన చర్యలు

కల్హేర్, జనవరి 8 : గాలి పటాలు (పతంగులు) గాలిలో ఎగురు వేసేందుకు నిషేధిత చైనా మాంజాతో పక్షులు పర్యావరణం మనుషులకు హాని ఉందని అందుకోసమే విక్రయించినా.. వినియోగించినా చర్యలు తీసుకుంటామని ఎస్సై వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. జాతీయ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో చైనా మాంజాను నిషేధించారన్నారు. ఈ మేరకు పతంగుల దుకాణాలను తనిఖీ చేసి హెచ్చరికలు జారీ చేశారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు

చౌటకూర్, జనవరి 8 : వరంగల్‌లో 9వ తేదీ నుంచి జరుగనున్న 57వ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు బుధవారం ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన క్రీడాకారులు బయలుదేరి వెళ్లారు. వారం రోజులుగా మండల కేంద్రం చౌటకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా ఖోఖో అడ్‌హక్ కమిటీ అధ్వర్యంలో 15 మంది క్రీడాకారులకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. వారం రోజుల పాటు ఖోఖో సీనియర్ క్రీడాకారుడు కలాలి నాగాగౌడ్ పర్యవేక్షణలో కొనసాగుతున్న ఈ ఉమ్మడి మెదక్ జిల్లా క్రీడాకారుల శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. వరంగల్ నగరంలో ఈ నెల 9, 10, 11వ తేదీల్లో ఈ పోటీలు జరుగనున్నాయి. చౌటకూర్‌కు చెందిన ఖోఖో క్రీడాకారులు 9 మంది ఉండటం విశేషం. జడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి ప్రధానో పాధ్యాయురాలు విజయలక్ష్మి, పీఆర్టీయూటీఎస్ మండలాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, పీడీ అరుణ, పీఈటీలు నాగాగౌడ్, త్రి శూల్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

జహీరాబాద్, జనవరి 8 : సైబర్ నేరాలపై విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని జహీరాబాద్ ఎస్సై కాశీనాథ్ అన్నారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని జడ్పీ పాఠశాలలో జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులకు సైబర్ నేరాలపై తీసుకునే జాగ్రత్తల పట్ల పోలీసులు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం పడుతున్న శ్రమను గుర్తించి విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు.

పరామర్శ

పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, జనవరి 8 : కల్హేర్ మండల పరిధిలోని ఖానాపూర్ కే గ్రామానికి చెందిన నామ వెంకయ్య చిన్న కుమారుడు శివకుమార్ మృతి చెందాడు. బుధవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెం ట మాజీ ఉప సర్పంచ్ ప్రభు, నాయకులు ఉప్పరి మోహన్, మారేపు సాయిలు, నామ హన్మంతు, ప్రశాంత్‌సాగర్, పండరి, వెంక ట్, సంతోశ్, విఠల్, నింగమయ్య, నర్సింహులు ఉన్నారు.

పట్టుదలతో విజయాలు సాధించాలి

మనూరు, జనవరి 8 : విద్యార్థులు పట్టుదలతో ముందుకు సాగితే విజయాలు మన వద్దకే చేరుకుంటాయని మండల విద్యాధికారి రాజశేఖర్ అన్నారు. బుధవారం మనూరు ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంతో మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ అంధత్వాని లెక్క చేయకుండా ముందుకు సాగారు కాబట్టే అంతటి విజయాలు సాధించారని అన్నారు. విజయాలకు వైకల్యం అడ్డు కాదని, పట్టుదల కృషి ఉంటే విజయం మీదేనన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాజు శెట్టి, ప్రధానోపాధ్యాయులు సుజాత, ఉపాధ్యాయులు విఠల్, రాజు కుమార్, ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

వాణిజ్య సముదాయంలో షెడ్డుల తొలిగింపు

పటాన్‌చెరు, జనవరి 8 : పటాన్‌చెరు మండల పరిషత్ వాణిజ్య సముదాయంలో దుకాణదారులు ఏర్పాటు చేసుకున్న షెడ్లను ఎంపీడీవో యాదగిరి ఆధ్వర్యంలో సిబ్బంది తొలిగించారు. బుధవారం పటాన్‌చెరు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని వాణిజ్య సముదాయంలో దుకాణ యజమానులు షెడ్లు వేసి సర్వీసు రోడ్డును ఆక్రమించుకోవడంపై వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన ఎంపీడీవో తన సిబ్బందితో కలిసి షెడ్లులను తొలిగిస్తున్నారు. వాణిజ్య సముదాయాల్లో అక్రమాలను నిలువరిస్తామని ఎంపీడీవో తెలిపారు.

ఆలయానికి సిమెంట్ విరాళం

ఆలయ నిర్మాణానికి సిమెంటును అందిస్తున్న దాత వినోద్ రాథోడ్

కోహీర్, జనవరి 8 : మండలంలోని పీచెర్యాగడి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని పీచెర్యాగడి కొత్త తండాలో నిర్మిస్తున్న భవానీమాత సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి దాత రాథోడ్ వినోద్ కుమార్ వంద సిమెంటు బస్తాలను విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతను తండావాసులు అభినందించారు.

పైడిగుమ్మల్ పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు

కోహీర్, జనవరి 8 : మండలంలోని పైడిగుమ్మల్ పాఠశాలలో బుధవారం రూం టు రీడ్ సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థుల అవసరార్థం అనేక రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతిఒక్కరూ వాటిని వినియోగించుకోవాలని సంస్థ ప్రతినిధి సంధ్య కోరారు. కార్యక్రమంలో ఎంఈవో జాకీర్ హుస్సేన్, హెచ్ఎం ప్రశాంతి, శిరీష, తిరుమలేశ్, సుధ, స్వప్న, ఫాతిమా, ఇబ్రహీం, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన నోడల్ అధికారి

సదాశివపేట, జనవరి 8 : మండల పరిధిలోని నిజాంపూర్ (కే) ప్రాథమిక పాఠశాలను నోడల్ అధికారి సుధాకర్ బుధవారం సందర్శించారు. పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ సాయంతో తెలుగు, ఇంగ్లిషు, గణితానికి సంబంధించి పాఠ్యాంశాల్లో చేసే బోధనను పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణలో కొబ్బరి మొక్కను నాటి నీరు పోశారు. ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, ఉపాధ్యాయులు నవనీత, సునీత, సీఆర్పీ నగేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వంట మనిషికి దరఖాస్తు చేసుకోవాలి

మనూరు, జనవరి 8 : కేజీబీవీలో ఖాళీగా ఉన్న వంట మనిషి, డే వాచ్ ఉమెన్ పోస్టులకు ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవాలని కేజీబీవీ ప్రత్యేక అధికారిని రాజేశ్వరి తెలిపారు. మండల పరిధిలోని పుల్‌కుర్తి కేజీబీవీలో హెడ్ కుక్‌గా పని చేసేందుకు 10వ తరగతి, అసిస్టెంట్ కుక్‌గా పనిచేసేందుకు 7వ తరగతి చదివి ఉండాలని అన్నారు. డే వాచ్ ఉమెన్‌గా పనిచేసేందకు 10వ తరగతి చదివి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.